ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

తాగిన డిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పొగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్‌మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్ డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

హోంగార్డుల సమస్యలపై పట్టింపేది?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మావోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ అవ్‌లం, సుక్కు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

దివ్యాంగుల ఆటల పోటీల్లో ప్రతిభ చాటాలి

బహుమతులు అందజేస్తున్న ఎంఈవో విజయ్ కుమార్

కమాన్‌పూర్,డిసెంబర్ 5: దివ్యాంగుల ఆటల పోటీల్లో ప్రతిభ చూపాలని ఎంఈవో విజయ్‌కుమార్ సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కమాన్‌పూర్ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ఎంఈవో విజయ్‌కుమార్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉర్దూ మీడియం హెచ్‌ఎం ఖలీదా బేగం, జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సరళ, కార్యదర్శి రాజ్‌కుమార్, భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు శారదాదేవి, పీఈటీ రేణుక, సీనియర్ జర్నలిస్టు జబ్బర్ ఖాన్ బహుమతులు అందజేశారు. తణుకు ప్రభాకర్, శ్రీనివాస్ ఉన్నారు.

కూలీకి వెళ్లి.. చేనులోనే కుప్పకూలి

భాగ్యమ్మ(ఫైల్)

ముత్తారం, డిసెంబర్ 5: పొలంలో పని చేస్తూ అప్పటి దాకా అందరితో సంతోషంగా ఉంది. ఉన్నట్టుండి ఒక్కసారి కుప్పకూలింది ఓ మహిళా కూలీ. దవాఖానకు తరలిస్తుండగా మార్గం మధ్యలో చనిపోయింది. వివరాలిలా ఉన్నాయి. ఓడేడు గ్రామానికి చెందిన దాసరి భాగ్యమ్మ(50) మంథని మండలం ధర్మారం గ్రామానికి చెందిన కొంతమంది కూలీలతో కలిసి పత్తి ఏరేందుకు కూలి పనికి వెళ్లింది. అక్కడ పని చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై కింద పడిపోయింది. తోటి కూలీలు వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో మంథనికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయింది. అప్పటి దాక తమతో పని చేసుకుంటూ మాట్లాడిన భాగ్యమ్మ ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో తోటి కూలీలు కన్నీరుమున్నీగా విలపించారు. భాగమ్మ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. భాగ్యమ్మకు కొడుకు, కూతురు ఉన్నారు. భర్త గతంలోనే చనిపోయాడు.

సీఎస్పీ కార్మికులకు ప్రమోషన్ లెటర్లు

గోదావరిఖని, డిసెంబర్ 5: జీడీకే-1 సీఎస్పీలో పనిచేస్తున్న కార్మికులకు అధికారులు గురువారం ప్రమోషన్ లెటర్లు అందజేశారు. కన్వేయర్ ఆపరేటర్, హెల్పర్లుగా శంకర్, నరేశ్, రవి ప్రమోషన్ ఉత్తర్వులు అందుకున్నారు. ఇక్కడ అధికారులు హెచ్‌వోడీ దాసరి శ్రీనివాస్, ఎస్‌ఈ బీ హరీశ్‌కుమార్, ఏఐటీయూసీ డిపార్టుమెంట్ కార్యదర్శి బండి మల్లేశ్, నాయకులు ఎస్ వెంకట్‌రెడ్డి, బుడిమె సమ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, చార్జ్ హ్యాండ్ రఘుపతి, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ రాజేశ్వర్‌రావు, మెకానికల్ ఫోర్‌మెన్ బాబులాల్, యాక్టింగ్ చార్జ్ హ్యాండ్ బీ సమ్మయ్య, కెమిస్ట్ శ్రీనివాస్ ఉన్నారు.

నియామకం

కమాన్‌పూర్, డిసెంబర్ 5: ఆటో యూనియన్ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కమాన్‌పూర్‌కు చెందిన మట్ట నర్సయ్యను నియమించినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్ట నర్సయ్య మాట్లాడుతూ ఆటో ఓనర్లు, డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తనవంతుగా శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

7ఎల్ ఈపీ గనిని సందర్శించిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్

ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుంటున్న ఏఎల్‌సీ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 5 : ఆర్జీ-2 డివిజన్‌లో మూసివేసిన జీడీకే 7ఎల్‌ఈపీ గనిని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మహమ్మద్ యూసూఫ్ గురువారం సందర్శించారు. జీఎం బండి వెంకటయ్యతో కలిసి బంకర్ ప్రమాదంలో మృతి చెందిన హెడ్ ఓవర్‌మెన్ సత్యనారాయణ మృతి స్థలాన్ని సందర్శించారు. ఆనంతరం ఏజెంట్ కార్యాలయంలో ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అతనికి రావలసిన అన్ని రకాలు బెనిఫిట్స్‌ను త్వరగా అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ప్రాజెక్టు అధికారి నేహ్రు, గ్రూప్ ఇంజనీర్ చంద్రశేఖర్, డీవైపీఎం శ్యాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

జీఎం కార్యాలయంలో యూనియన్ నాయకుల గలాటా

- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

గోదావరిఖని, డిసెంబర్ 5: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో రెండు జాతీయ సంఘాలకు చెందిన ముఖ్యనాయకులు గొడవ పడ్డారు. జీఎం కార్యాలయంలోని ఎస్‌వోటు జీఎం ఛాంబర్‌లో హెచ్‌ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ముఖ్య నాయకుడు మడ్డి ఎల్లయ్య తారసపడి గొడవకు దిగారు. హెచ్‌ఎంఎస్‌లో ఇటీవల చేరిన ఒక కార్మికుడికి చార్జిషీట్ ఇచ్చిన విషయమై మాట్లాడడానికి వెళ్లిన రియాజ్ అహ్మద్‌కు అక్కడే ఏఐటీయూసీ నాయకుడు ఉండటంతో ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. మాట మాట పెరిగి భౌతిక దాడికి పాల్పడేస్తాయి రావడంతో అక్కడే ఉన్న అధికారులు వారిని ఆపి సముదాయించి పంపించి వేశారు. ఇద్దరు జాతీయ సంఘాలకు చెందిన నాయకులు బహిరంగంగా దూషించుకున్న విషయం సంచలనంగా మారింది.

సమావేశంలో ఫోటో వీడియో గ్రాఫర్స్

ఫొటోగ్రఫీపై అవగాహన సదస్సు

గోదావరిఖని, డిసెంబర్ 5: రామగుండం, ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ, అంతర్గాం ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఫ్యూజి ఫిల్మ్ కంపెనీ ఆధ్వర్యంలో పట్టణంలోని గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ఫొటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఫ్యూజి ఫిల్మ్ కంపెనీ మెంటార్ ఎస్‌కే హుస్సేన్ నూతన కెమెరాలు, బిజినెస్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మోడల్ తో ఫొటో షూట్ నిర్వహించారు. ఇక్కడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి మొహమ్మద్ ఇర్ఫాన్, ఉమ్మడి, వరంగల్, కరీంనగర్ కుటుంబ భరోసా ఇన్‌చార్జి సూరిబాబు, రాష్ట్ర, జిల్లా నాయకులు పల్లెర్ల ఉదయ్, మొదంపల్లి రామస్వామి, రామగుండం అధ్యక్షుడు ఆర్శనపల్లి రాజు, గుమ్ముల నవీన్, మెండె శంకర్, ఫ్యూజి ఫిల్మ్ కంపెనీ ప్రతినిధులు సత్య, రూపేశ్, కల్యాణ్, ఉన్నారు.

ప్రపంచ నేల దినోత్సవం

అంతర్గాం, డిసెంబర్ 5: ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో నేల ఆవశ్యకతను రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణ, పచ్చి రొట్ట ఎరువుల వల్ల ఉపయోగాలు, పీఎస్‌బీ వాడకం, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు వరి, పత్తి పంట సాగు అనంతరం వరి కొయ్యలను, పత్తి కట్టెను కాల్చకుండా నేలలో కలియదున్ని ఎరువుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సతీష్, హరీష్, మండల రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

సుల్తానాబాద్, డిసెంబర్ 5 : పట్టణంలోని రైస్ మిల్ కెనాల్ వద్ద లారీ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన గురువారం సుల్తానాబాద్‌లో చోటు చేసుకుంది. పెద్దపల్లికి చెందిన ప్రసాద్ సుల్తానాబాద్‌లోని ఓ రైస్‌మిల్లులో మిల్లు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో కెనాల్ వద్ద లారీ ఢీకొని తలపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికంగా అక్కడే ఉన్న కొంత మంది డ్రైవర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానాకు తరలించారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా తేజస్వి



పెద్దెల్లి తేజస్వి

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 5: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో రామగుండం నగరపాలక సంస్థ 11వ డివిజన్ కార్పొరేటర్, న్యాయవాది పెద్దెల్లి తేజస్వి ప్రకాశ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. గెలుపునకు సహకరించిన మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీపీసీ దవాఖానను సందర్శించిన బృందం

జ్యోతినగర్, డిసెంబర్ 5: ఎన్టీపీసీ దవాఖానను న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి దవాఖానను సందర్శించింది. ఉత్తమ దవాఖాన పురస్కారంలో భాగంగా దవాఖానలో అన్ని వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య చికిత్సపై వివరాలను సేకరణతో దవాఖాన సేవలపై అసెస్‌మెంట్ చేసుకున్నారు. ఇక్కడ బృందం సభ్యులు ఏఐఎంఎస్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డీకే శర్మ, ఎన్టీపీసీ సీసీ సీఎంఓ డాక్టర్ కమల్ పురుషోత్తం, ఎన్టీపీసీ సీసీ-ఈఓసీ హెచ్ఆర్ డీజీఎం అజయ్‌ప్రసాద్ ఉన్నారు.

కుక్కలగూడూర్‌లో హత్య

పాలకుర్తి, డిసెంబర్5: పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన మానాల శ్రీనివాస్(50)ను అదే గ్రామానికి చెందిన చింతల ప్రశాంత్ హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మానాల శ్రీనివాస్(50), చింతల ప్రశాంత్ ఇద్దరు మద్యానికి బానిసయ్యారు. గురువారం రాత్రి మద్యం తాగిన అనంతరం గ్రామ శివారులోని కచ్చీరు ప్రాంతంలో గొడవపడ్డారు. ప్రశాంత్ మద్యం మత్తులో శ్రీనివాస్ తలపై పెద్దతో బండతో దాడిచేశాడు. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రశాంత్‌పై శ్రీనివాస్ కుటుంబీకులు దాడి చేసేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్ నగర్ ఎస్ఐ. స్వామి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పూర్తి వివరాలుతెలియాల్సి ఉంది.

నిధుల మంజూరుపై హర్షం

మంథని, డిసెంబర్ 5: ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కృషితో మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కావడంపై మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం సీఎం సభ విజయవంతం కావడంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప దేవాలయంలో ఇరుముడి పూజలు

పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

జ్యోతినగర్, డిసెంబర్ 5: ఎన్టీపీసీ టౌన్‌షిప్ వైకుంఠపురంలోని అయ్యప్ప దేవాలయంలో గురువారం అర్చకుడు రాంపెల్లి వామన్ శర్మ ఇరుముడి పూజ నిర్వహించారు. కొందరు భక్తులు కార్తీక మాసం ప్రారంభంలోనే అయ్యప్పస్వామి దీక్ష చేపట్టగా, మండల దీక్ష పూర్తవుతున్న వారికి అర్చకులు ఇరుముడి కట్టారు. అనంతరం చంద్ర గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు శబరిమలై దర్శనానికి బయలుదేరారు. అంతకుముందు ఆలయంలోఅఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి అయ్యప్ప దీక్షను స్వీకరించారు. ఇక్కడ పొలినేని సంపత్‌రావు, అయ్యప్ప గురుస్వాములు ప్రభాకర్, శేషు, కార్తీక్ స్వామి, కృష్ణ, స్వాములు ఉన్నారు.

రెండోరోజు కొనసాగిన రైల్వే గుర్తింపు ఎన్నికల పోలింగ్

జ్యోతినగర్(రామగుండం), డిసెంబర్ 5: రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో రెండోరోజు గురువారం దక్షిణమధ్య రైల్వే రామగుండం రైల్వేస్టేషన్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 200మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో 315 ఓట్లతో మొత్తం రెండురోజుల పోలింగ్ 515ఓట్లకు చేరింది. మొత్తం 712 ఓట్లకు గాను నేడు శుక్రవారంతో ముగియనున్న పోలింగ్‌లో ఇంకాను మిగిలి ఉన్న 197 ఓట్ల పోలింగ్ నమోదు కావాల్సి ఉంది.

నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూపులు

కమాన్‌పూర్, డిసెంబర్ 5: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పదేళ్ల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఏడాది గడుస్తున్నా రాష్ట్రంలో క్రియాశీలక మంత్రిగా వ్యవహరిస్తున్న శ్రీధర్‌బాబు సొంత నియోజక వర్గమైన మంథనిలో మాత్రం ఇంకా నామినేటెడ్ పదవుల భర్తీ కాలేదు. నామినేటెడ్ పదవుల జాప్యంతో కాంగ్రెస్ నాయకుల్లో నిస్తేజం నెలకొంది. ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన విజయోత్సవాలు నిర్వహిస్తుంటే మరోవైపు మంథని నియోజక వర్గంలోని కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారు మాత్రం ఆశల పల్లకీలో ఊగుతూ నిస్తేజంలో ఉన్నారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి, డైరెక్టర్ పదవులు, ఆదివరాహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవి, డైరెక్టర్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. గత జనవరి 2న కమాన్‌పూర్ ఆదివరాహ స్వామి దేవస్థానం పాలక వర్గం ఏడాది పదవి కాలం ముగిసిపోయింది. ఈ రెండు పాలక వర్గాలు రద్దయి దాదాపు ఏడాది కాలం గడుస్తుంది. ఇంకా వీటికి సంబంధించి పాలక వర్గాల నియామకం మాత్రం అటకెక్కింది. ఇప్పటికీ ఎవరికి వారే చైర్మన్ పదవి, డైరెక్టర్ పదవులు తమకే వస్తాయన్న ధీమాతో ఉన్నారు.మార్కెట్ కమిటీ, ఆదివరాహ స్వామి దేవస్థానం కమిటీ పాలక వర్గంలో చైర్మన్, డైరెక్టర్ పదవులు ఆశిస్తున్న వారు తమ పేర్లను పరిశీలించాలని పలువురు మంత్రి దృష్టికి తీసుకవెళ్లినట్లు తెలిసింది. నామినేటెడ్ పోస్టుల భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్ కావడంతో పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య పెద్దగానే ఉంది. ఆదివరాహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవితోపాటు డైరెక్టర్ పదవులను సైతం ఆశిస్తున్న వారు కూడా చాలా మందే ఉన్నారు. గతంలో ఓసీలకు ఆదివరాహ స్వామి దేవస్థానం చైర్మన్ పదవి కేటాయించారు. ఆలయ కమిటీ నియామకం ఎప్పుడు చేస్తారో, ఎవరికి అవకాశం కల్పిస్తారో ఏ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి వరిస్తుందో ఈ పాలక వర్గాల నియామకం చేపట్టే వరకు వేచి చూడాల్సిందే.